క్లుప్తంగా

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ లబ్ధిదారులైన సంగీతకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల రాములు, ఇంతియాజ్, రింగుల భూషణ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ



బాల్కొండ : బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యుల కోసం నూతన భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మంత్రి ప్రశాంత్‌రెడ్డి కృషితో భవన నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, నాయకులు దాసరి వెంకటేశ్, మానేటి నాగభూషణం, ఎంపీటీసీ రాంరాజ్‌గౌడ్, ఫోరం అధ్యక్షుడు మల్లయ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని 26వ వార్డులో అక్రమంగా రోడ్డును కబ్జాచేసి ఇంటినిర్మాణం చేపట్టడంపై సోమవారం కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డు కబ్జా చేయడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో గంగాధర్, అశోక్, జఫర్, ఫరిం, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

'అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'

ఎడపల్లి(బోధన్) : తెలంగాణ కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారత యాదవ మహా సభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారాం యాదవ్ అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో మాట్లాడుతూ సబ్బండ వర్గాలను అవమానించేలా దుషించినందుకు నిరసనగా ఈనెల 17 వ తేదీన యాదవ కుర్మ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్టు వెల్లడించారు. సమావేశంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్,ఎంపిపి శ్రీనివాస్,ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, టాణాకలాన్ సర్పంచ్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



రెంజల్(బోధన్): అంబేడ్కు జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన దళితరత్న అవార్డు గ్రహీతలను రెడ్‌క్రాస్ డివిజన్ ఉపాధ్యక్షుడు అష్ఫాఖ్ అహ్మద్ ఘనంగా సన్మానించారు. మండలంలోని బోర్గాం గ్రామంలో సోమవారం మండలంలోని ముగ్గురు అవార్డు గ్రహీతలకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయనతో పాటు గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు దళితరత్న అవార్డు గ్రహీతలతో పాటు పదవ తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థికి సన్మానించారు. దళిత నాయకులు నీరడి రవికుమార్, రొడ్డ లింగం, సాయిలులను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాణితో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ యాప్‌ను వినియోగించుకోవాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : సెల్‌ఫోన్ పోయిన వారు సీఈఐఆర్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై మహేష్ సూచించారు. మోపాల్‌కు చెందిన కెంపు రంజిత్ ఫోన్ పడిపోవడంతో సోమవారం యాప్ ద్వారా గుర్తించి ఆయనకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఫోన్‌కు సంబంధించిన వివరాలు యాప్‌లో నమోదు చేసుకుని లోకేషన్ ఆధారంగా సెల్‌ఫోన్ ఎక్కడ వినియోగిస్తున్నారో తెలుసుకోవచ్చన్నారు. అదేవిధంగా రంజిత్‌కు చెందిన ఫోన్‌ను గుర్తించి ఆయనకు అప్పగించామని తెలిపారు. ఇందుకు కృషి చేసిన సిబ్బందిని అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం..

- జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు



సీఎం కప్ క్రీడలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సోమవారం సీఎం కప్ క్రీడలను జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ప్రారంభించారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు జరుగగా పీఈటీలు మరియదాస్, బాష్కర్, పీడీ నాగమణి క్రీడలను నిర్వహించారు. క్రీడలతో మానసికోల్లాసం ఏర్పడుతుందన్నారు. అమ్రాద్, మెట్టు, సింగంపల్లితండా, మాదాపూర్, మాక్లూర్‌కు చెందిన జట్లు పోటీలో పాల్గొన్నాయి. మొదటి రోజు జరిగిన పరుగు పందెం పోటీల్లో అమ్రాద్‌తండా, సింగంపల్లి తండాలకు చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఎంపీడీవో జె క్రాంతి, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, ఎస్సై యాదగిరిగౌడ్, కో ఆప్షన్ సభ్యుడు కోకా హైమద్, మనోహర్‌రావులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లో సోమవారం చీఫ్ మినిస్టర్ కప్ టోర్నీ ప్రారంభమైంది. ఈ పోటీలను ఎంపీపీ గౌతమి జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభించారు. కబడ్డీలో 8, వాలీబాల్‌లో 8, ఖోఖోలో 6 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌రెడ్డి, ఎంఈవో ఆంధ్రయ్య, సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ జ్యోతి, సుమన్ యాదవ్, పీడీలు స్వప్న, రాజేందర్, గంగాధర్ పాల్గొన్నారు.

బాల్కొండ : బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండల కేంద్రాల్లో సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడలను సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వర్ని : వర్ని మండల కేంద్రంలో జెడ్పీటీసీ హరిదాసు సీఎం కప్ టోర్నీని ప్రారంభించారు. క్రీడల్లో వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్ ఎంపీవో చందర్ నాయక్, తహసీల్దార్ విఠల్, ఎంఈవో శాంతకుమారి, పీఈటీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని గురుకుల పాఠశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత సీఎం కప్ టోర్నీని ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను, ఎంపీపీ పస్కనర్సయ్య, జెడ్పీటీసీ సంతోష్, కౌన్సిలర్లు ఇంతియాజ్, ఫయాజ్, తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్, ఎంఈవో రాజగంగారాం, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నవీపేట : సీఎం కప్ టోర్నీని ఎంపీపీ సంగెం శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీటీసీ లు మైసరాధ, మీన, వార్డు సభ్యులు నవీన్‌రాజ్, ఏఎస్సై మోహన్ రెడ్డి, ఎంపీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో సోమవారం సీఎం కప్ పోటీలను ఎంపీపీలు పస్క నర్సయ్య, మాస్త ప్రభాకర్ ప్రారంభించారు. ఆలూర్ తహశీల్దార్ దత్తాద్రి, ఆర్మూర్, మాక్లూర్ ఎంపీడీవోలు శ్రీనివాస్, క్రాంతి, జెడ్పీటీసీ సంతోష్, ఆలూర్, డీకంపల్లి, గుత్ప సర్పంచ్‌లు కళ్లెం మోహన్ రెడ్డి, భోజన్న, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ : మండల స్థాయి క్రీడలను బాబాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభయ్యాయి. జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి క్రీడలను ప్రారంభించారు. సర్పంచ్ అయేష ఫిర్దోస్, జెడ్పీ కో ఆప్షన్ మోయిజ్, ఎంపీటీసీ సుర్జిల్, ఎంపీడీఓ రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీధర్, ఎంఈవో స్వామి పాల్గొన్నారు. అలాగే ఎడపల్లి, బోధన్ పట్టణంలో, మోస్రా కోటగిరి మండలాల్లోనూ టోర్నీ ప్రారంభమైంది.



కమ్మర్‌పల్లిలో కబడ్డీలో తలపడుతున్న జట్లు



బాల్కొండలో టోర్నీని ప్రారంభిస్తున్న సర్పంచ్



ముప్కాల్ మండల కేంద్రంలో..



వర్నిలో రన్నింగ్ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు



ఆర్మూర్ పట్టణంలో క్రీడాకారులతో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత



ఆలూర్‌లో ఎంపీపీల ఆధ్వర్యంలో..



బాబాపూర్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ



ఎడపల్లిలో క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎంపీపీ



బోధన్ పట్టణంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



మోస్రాలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ విజయభాస్కర్



నవీపేట్‌లో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ

వరి ధాన్యం కొనలేం..

చేతులెత్తేసిన అమ్రాద్ సొసైటీ
- ఇష్టం వచ్చిన చోట అమ్ముకోవాలంటూ సూచన
- కలెక్టర్‌ను ఆశ్రయించిన మదన్‌పల్లి రైతులు



కలెక్టరేట్‌కు వచ్చిన మదన్‌పల్లి రైతులు

మాక్లూర్ : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనలేం అంటూ మండలంలోని అమ్రాద్ సొసైటీ పాలక వర్గం చేతులెత్తేసిందని, పైగా ఎక్కడైనా ప్రైవేట్‌కు అమ్ముకోవాలంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం మదన్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు కలెక్టరేట్‌కు తరలివెళ్లి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. అమ్రాద్ సొసైటీ పరిధిలో అమ్రాద్, ముత్యంపల్లి, ఒడ్డెట్‌పల్లి, మదన్‌పల్లి గ్రామాలకు గాను 4 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ఇప్పటికే 8వేల బస్తాలు కాంటాలు నిర్వహించి 10 రోజులు కావస్తున్నా బస్తా ధాన్యం కూడా తరలించలేదన్నారు. ఇంకా కాంటాలు జరుపాల్సిన ధాన్యం కుప్పలు తెప్పలుగా కల్లాలు, రోడ్లపై పేరుకపోయి ఉందన్నారు. ఈ విషయమై అమ్రాద్ సొసైటీ పాలక వర్గం రోజు ఏదో ఒక కారణం చెప్పుతూ తప్పించుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తీరా సోమవారం మాతో కొనుగోళ్లు సాధ్యం కాదని చేతులెత్తేసిందని కలెక్టర్‌కు వారి వివరించారు. 40 కిలోల బస్తాకు తరుగు 2 కిలోలు తీసుకుంటూ, హమాలీ కూలీతో సంబంధం లేకుండా లోడింగ్ సమయంలో తీసుకునే బస్తాకు రూ. 1 బదులు అదనంగా రూ. 20 తీసుకుంటున్నారని, లారీలు రాకపోవటంపై రైతులు పాలకవర్గంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌ను ఆశ్రయించామని వారు పేర్కొన్నారు. రైతులు ఆరోపించిన విషయమై అమ్రాద్ సొసైటీ కార్యదర్శి గంగారాంను వివరణ కోరగా లారీల కొరత తీవ్రగా ఉందన్నారు. అందువల్లే కాంటా చేసిన ధాన్యం బస్తాలు ఎక్కడికక్కడే ఉండిపోయాయని, కొనుగోలు కేంద్రాలు నిర్వహించలేమని, మీ ఇష్టం వచ్చిన దగ్గర అమ్ముకోవాలని చెప్పిన దాట్లో వాస్తం లేదన్నారు. అసలు ఆ మాటే అనలేదన్నారు. రైతుకు సంబంధించి వరి ధాన్యం మొత్తం కొనుగోలు చేసే వరకు కొనుగోలు కేంద్రాలు నడుపుతామన్నారు. లోడింగ్ చేసేటప్పుడు రైతులే ఇష్టపూర్వకంగా రూ. 20 చెల్లిస్తున్నారన్నారు. అందులో మా జోక్యమేమీ లేదన్నారు. రైతులు ఓపిక పడితే లారీలను రప్పించి త్వరగా కొనుగోళ్లు పూర్తి చేస్తామని గంగారాం తెలిపారు.

'కంటి వెలుగు' కార్యక్రమం దేశానికే ఆదర్శం



పురాణిపేట్‌లో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు



యాద్‌గార్‌పూర్‌లో సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్

భీమ్‌గల్ : కంటివెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని పిప్రి సర్పంచ్ తోట శంకర్, ఎంపీటీసీ సాయి ప్రసన్న కుమార్ అన్నారు. రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని మండలంలోని పిప్రి గ్రామంలో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జితేందర్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిబ్బందికి ఘన సన్మానం

రుద్రూర్ : కోటగిరి మండలం యాద్‌గార్‌పూర్ గ్రామంలో కంటి వెలుగు సిబ్బందిని శిబిరం ముగింపు సందర్భంగా సోమవారం సర్పంచ్ విజయసాయన్న ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వైద్యులు శ్రీలత, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, డీ.ఈ.వో జ్యోతి,రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్స్ సవిత రాజమణి, జీపీ కార్యదర్శి సునంద, ఆశా వర్కర్లు రమణి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

నేడు చిక్కడపల్లిలో కంటి వెలుగు

రుద్రూర్‌లోని చిక్కడపల్లి పంచాయతీలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు గ్రామ సర్పంచ్ పుష్ప లత రమేష్ తెలిపారు.

మహిళా సంఘ భవనంలో దవాఖానా వద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న సంఘాల సభ్యులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉన్న మహిళా సంఘ భవనంలో బస్తీ దవాఖానాను ఏర్పాటును వ్యతిరేకిస్తూ మహిళ సంఘాల సభ్యులు సోమవారం రాస్తారోకోకు దిగారు. 44వ నెంబరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. తమకు సమాచారం ఇవ్వకుండా భవానికి సంభందించిన ప్రహారి నిర్మాణాన్ని కూల్చి బస్తీ దవఖానకు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అలాగే ప్రస్తుతం తాత్కాలికంగా నిర్వహిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని సైతం తొలగించాలని డిమాండ్ చేశారు. పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పి రాస్తారోకో విరమింపజేశారు. కార్యక్రమంలో గుండం రూప, టీ సుమలత, ఆస్మ, రేణుక, పర్వీన్ సుల్తానా, మెరుగు లలిత, కమల, సుజాత పాల్గొన్నారు.

నీరడి లక్ష్మణ్‌ను తొలగించాం

- బీఎస్పీ అర్బన్ కమిటీ రద్దు

నిజామాబాద్ నాగారం : బహుజన సమాజ్ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ కమిటీని రద్దు చేయడంతో పాటు, అర్బన్ కమిటీ ఇంచార్జీ నీరడి లక్ష్మణ్‌ను పదవి నుండి తొలగించడం జరిగిందని జిల్లా అధ్యక్షులు పల్లికొండ నర్సయ్య తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ నిజామాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. బహుజన సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ భరోసా సభకు సంబంధించిన జన సమీకరణ సమాచారాన్ని జిల్లా కమిటీకి ఇవ్వలేదని, బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేశారనే అభియోగంపై జిల్లా కమిటీలో చర్చించి తీర్మానం చేశామన్నారు.

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి



బోధన్ ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రం అందిస్తున్న పీవోడబ్ల్యూ సభ్యులు

బోధన్‌టౌన్(బోధన్): మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ సతీమణి అయేషా ఫాతిమా డిమాండ్ చేశారు. రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వారికి మద్దత్తుగా బోధన్‌లో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని ఉషోదయ డిగ్రీ కళాశాల నుండి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు సాగింది. బీజేపీ ప్రభుత్వం రెజ్లర్లకు న్యాయం చేయట్లేదని, ఎంపీ బ్రిజ్ మోహన్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డప్పటికీ కేంద్రం స్పందించడం లేదన్నారు. ఈ ర్యాలీలో జెడ్పీ వైస్ చైర్మెన్ రజిత యాదవ్, విద్యార్థులు మహిళలు పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో..

రెజ్లింగ్ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులు బ్రిజ్‌మోహన్ సింగ్‌ను తక్షణమే ఎంపీ పదవి నుండి తొలగించాలని పీవోడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. సోమవారం పీవోడబ్ల్యూ ప ట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆధ్యాత్మికం..

శివాలయంలో ప్రత్యేక పూజలు




ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భారత్ గ్యాస్ మేనేజర్ సుమన్ కుటుంబ సభ్యులు స్వామివారికి అభిషేకం చేసి రామాలయంలో సత్యనారాయణ స్వామి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుమన్, పీసీ గంగారెడ్డి, గంగాకిషన్, మీనాచందు, కొడిగెల మల్లయ్య, బొంద్ల ఆనంద్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17న మాస శివరాత్రి కల్యాణోత్సవం

బోధన్‌టౌన్(బోధన్): ఈనెల 17వ తేదీ బుధవారం పట్టణంలోని ఏకచక్రేశ్వర మందిరంలో మాస శివరాత్రి కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ అధ్యక్షులు బీర్కూర్ శంకర్ తెలిపారు. ఆసక్తి గల భక్తులు ఆలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(నిజామాబాద్ సిటీ)

స్క్రీన్-1 –	కథ వెనుక కథ – 10.35 ది స్టోరీ ఆఫ్ ఎ బ్యూటిఫుల్ గర్ల్ – 1.15 గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ (ఇంగ్లిష్) – 4.10 ఛత్రపతి (హిందీ) – 7.25 సంగీతం స్కూల్ – 10.10
స్క్రీన్-2 –	కస్టడీ 10.00, 1.10, 4.20, 7.30, 10.40
స్క్రీన్-3 –	విరూపాక్ష – 10.00, 7.45 పొన్నియన్ సెల్వన్ 2 – 1.05 ఉగ్రం – 4.35, 10.50
స్క్రీన్-4 –	ఛత్రపతి (హిందీ) – 10.55 సంగీతం స్కూల్ – 1.40 భువన విజయం – 4.30 ది కేరళ స్టోరీ – 7.10 ఫర్హానా – 1.20

కళ తప్పుతున్న 'బృహత్ పల్లె వనాలు'



నల్లూర్ శివారులో ఏర్పాటు చేసిన బృహత్ వనంలో ఎండిపోతున్న మొక్కలు

బాల్కొండ : పల్లె ప్రగతిలో భాగంగా ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఒక పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. అలాగే మండలానికి ఒక బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. కాని అధికారులు పట్టించుకోకపోవడం వల్ల బృహత్ వనాలు కళ తప్పుతున్నాయి. ముప్కాల్ మండలంలో నల్లూర్ గ్రామ శివారులో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్ట దిగువ భాగాన బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. కాని అక్కడ పరిశీలిస్తే ఇది వనమేనా అనే అనుమానం కలుగుతుంది. వనంలో మొక్కలు ఎండుతున్నాయి. కొన్నిచోట్ల ఇప్పటివరకు మొక్కలను నాటలేదు. ఆహ్లాదం ప పంచే వాతావరణమే అక్కడ లేదంటే అతిశయోక్తి కాదు. వనంలో మొక్కల కంటే ఎక్కువగా పిచ్చి మొక్కలే పెరిగాయి. నీటి సౌకర్యం సరిగా లేదు. దీంతో కళహీనంగా మారుతుంది.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడా..?

బృహత్ పల్లె వనాలను పర్యవేక్షించడంలో అధికారులు విఫలం చెందుతున్నారనే విమలున్నాయి. పల్లె వనాలను గ్రామాలకు సుదూర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. దీంతో వాటి వైపు కన్నెత్తి చూసే వారు లేకుండ పోయారు. బాల్కొండ మండలంలో బోదేపల్లి శివారులో కొండ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. మెండోరా మండలం పోచంపాడ్‌లో గోదావరి వైపు ఏర్పాటు చేశారు. ముప్కాల్‌లో నల్లూర్ శివారులో ప్రాజెక్ట్ దిగువ భాగన ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ లోపం వాటి పాలిట శాపమైంది. పల్లెల్లో ప్రకృతి వనాలు కూడ పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ఉన్నత అధికారులు స్పందించి మొక్కలను పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

రేపు ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు

ఆర్మూర్‌టౌన్ : పట్టణ శివారులోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్‌లో ఈనెల 17న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు, మినిమహానాడు నిర్వహిస్తున్నట్లు టీటీడీపీ పార్టీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు దేగాం యాదగౌడ్ తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని టీటీడీపీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, సమన్వయకర్త కంభంపాటి రామ్మోహనరావు, పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కరాటేలో కృష్ణవేణి స్కూల్ విద్యార్థుల ప్రతిభ

పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థినిలు కరాటే, కుంగ్ ఫూ చాంపియన్షిప్ పోటీల్లో అద్భుత ప్రతిభతో బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ మహ్మద్ మీన్హాజ్ సోమవారం తెలిపారు. హైదరబాద్‌లో ఆదివారం భారత్ షాటోకాన్ ర్యూ కరాటే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కరాటే, కుంగ్ ఫూ చాంపియన్షిప్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాఠశాలకు చెందిన మేఘన, రాధిక, నిఖిత, శ్రీజ, మనోజ్ఞ అద్భుత ప్రతిభతో బంగారు పతకాలు సాధించారు. విద్యార్థినిలను పాఠశాల డైరెక్టర్ విజయ్ కర్తన్, ప్రిన్సిపల్ మీన్హాజ్, కరాటే మాస్టర్ సురేశ్ అభినందించారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ ఎ. శివ : 9848956776
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899